క్లుప్తంగా

21న వాహనాల వేలం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన 40 ద్విచక్ర వాహనాల వేలంను 21వ తేదీన నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాలు కావాల్సిన వారు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఇతర వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నడిగూడెం ఎస్‌ఐ పి.ఏడుకొండలు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. షీ టీమ్స్, మహిళల భద్రత, 100 కాల్, సోషల్ మీడియా, ఓటీపీ ఫ్రాడ్, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూర్యాపేట షీ టీమ్ ఇన్‌చార్జ్, ఏఎస్‌ఐ పాండునాయక్, మహిళా కానిస్టేబుల్ సాయి జ్యోతి, పాఠశాల ప్రత్యేక అధికారి వెంకటరమణ, ఏఎస్‌ఐ జగన్‌మోహన్, స్థానిక పోలీస్ సిబ్బంది లావణ్య, సక్రునాయక్, కళాజాతా బృందం తదితరులు పాల్గొన్నారు.

‘24 గంటల విద్యుత్ అవాస్తవం’

గరిడేపల్లి : వ్యవసాయ రంగానికి సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు ఇస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నారని అందులో వాస్తవం లేదని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయానికి కనీసం ఐదు గంటల విద్యుత్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎల్‌సీ, బ్రేక్ డౌన్‌ల పేరుతో కరెంట్ కోత విధిస్తున్నారని అన్నారు. లోవోల్టేజీతో మోటార్లు, స్టార్టర్లు కాలిపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న సిస్టర్ జ్యోతి

మఠంపల్లి : మండల కేంద్రంలోని సెయింటాన్స్ ఉన్నత పాఠశాలలో స్థానిక పునీత అన్నమ్మ సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సుమారు 105 మంది (లీడర్లు) మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ సిస్టర్ జ్యోతి మాట్లాడారు. కార్యక్రమంలో ఏరియా ఇన్‌చార్జ్ సిస్టర్ స్వర్ణ, మఠంపల్లి ఇన్‌చార్జ్ సిస్టర్ రూబీ, కోఆర్డినేటర్లు రాణి, మేరీ, మహిళలు పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు అందించాలి

మునగాల : గృహలక్ష్మి, దళితబంధు లాంటి పథకాలను అర్హులైన పేదలకు మంజూరు చేయాలని, డబుల్ బెడ్ రూమ్ పేదలకు ఇవ్వాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు పుల్లూరి సింహాద్రి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సూర్యాపేట జిల్లాలో గృహలక్ష్మి పథకానికి 48,752 మంది అర్హత కలిగి ఉన్నట్లు అధికార యంత్రాంగం ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారరి కానీ ఆచరణలో మాత్రం అర్హులకు కాకుండా బీఆర్‌ఎస్ నాయకుల అనుచరులకు, కార్యకర్తలకే దక్కుతున్నాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరులో ఇదే తంతు కొనసాగితే రానున్న రోజుల్లో గ్రామాల్లో ఘర్షణలు తలెత్తే ప్రమాదముందన్నారు.

విద్యుత్ కోతను నిరోధించాలి

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురం పరిధిలోని వ్యవసాయ బావులు, బోర్లకు విద్యుత్ సరఫరాలో కోతను నిరోధించాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు అల్వాల రామారావు మంగళవారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. అధికారులు ఇష్టారాజ్యంగా కోత విధిస్తుండటంతో వరి పొలాలు ఎండిపోయే ప్రమాదముందన్నారు. విద్యుత్ శాఖ సిబ్బందికి చెప్పినా స్పందన కరువైందన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ కోతను నిరోధించాలన్నారు.

కాంగ్రెస్ నాయకుడు నరేష్ మృతి

కోదాడరూరల్ : మండల పరిధిలోని గుడిబండకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇరుగు నరేష్ (36) డెంగీ జ్వరంతో ఆరోగ్యం విషమించి మృతి చెందాడు. మంగళవారం ఆయన మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం కల్పించారు. పార్టీ నాయకుడు నరసింహారెడ్డి మృతుని కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసహాయం చేశాడు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎండీ.రఫీ, ఇర్ల నరసింహారెడ్డి, ఓ.రామకృష్ణారెడ్డి, నాగరాజు, సైదులు, రాజారావు, గామయ్య, శ్రీను, సిద్ధయ్య, గాంధీ ఉన్నారు.

ఎంపీపీ పరామర్శ

కోదాడరూరల్ : మండల పరిధిలోని దోరకుంటలో సత్తూరి తిరపతమ్మ, గుడిబండకు చెందిన ఇరుగు నరేష్‌లు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయా గ్రామాల్లో వారి మృతదేహాలను ఎంపీపీ చింత కవితారాధారెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం కల్పించారు. ఆమె వెంట పీఏసీఎస్ చైర్మన్ రమేష్, సలీం, రాము, నాగయ్య ఉన్నారు.

గుంతల రోడ్డుపై నడిచేదెలా..

- కోదాడలో రోడ్లు అధ్వానం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



భవానీనగర్‌లో గుంతలమయంగా మారిన రోడ్డు

కోదాడ : పట్టణంలోని పలు కాలనీల వీధుల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోట్ల రూపాయల నిధులతో పట్టణంలో మౌలిక వసతులను మెరుగు పరుస్తున్నామని పాలకులు చెపుతున్నా మాటలకు, వాస్తవ పరిస్థితికి పొంతన లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్ల పరిస్థితిపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పట్టణంలోని భవానీనగర్‌లో పలు వీధులు గుంతలమయంగా మారాయని, చిన్న వర్షం వచ్చినా నడవలేని పరిస్థితి నెలకొందని ఆ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడిబండ రోడ్డులోని పెట్రోల్‌బంకు వద్ద నుంచి భవానీనగర్‌కు వెళ్లే దారి అధ్వానంగా మారిందని చెబుతున్నారు.

బాగున్న రోడ్లపై మళ్లీ సీసీ..

పట్టణంలోని పలు వార్డుల్లో గతంలో సీసీ రోడ్డు వేశారు. ప్రస్తుతం పట్టణం విస్తరించినందున పట్టణ శివారు కాలనీల్లో సీసీ రోడ్డు వేయాల్సి ఉంది. కానీ నిధులను వార్డులన్నింటికి సమానంగా కేటాయించుతుండటంతో అవసరం లేని వార్డుల్లో గతంలో వేసిన సీసీ రోడ్డ మీదే మళ్లీ సీసీ రోడ్డు వేయడం పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం అధికారులకు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని అంటున్నారు. టీటీడీ కళ్యాణ మండపం వీధిలో సీసీ మీద సీసీ వేయడం, అది నాణ్యత లేకపోవడంతో కొద్ది రోజులుకే కంకర తేలి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఆ ప్రాంత వాసులు అంటున్నారు.

అవసరమున్న చోట సీసీ రోడ్డు నిర్మించాలి



పట్టణంలో రోడ్ల నిర్మాణం ఒక పద్ధతి ప్రకారం జరగడం లేదు. పట్టణ శివారు కాలనీల్లో సీసీ రోడ్డు అవసరం ఉండగా పట్టణంలో అవసరం లేని చోట్ల రోడ్డు వేస్తున్నారు. గట్టిగా, పటిష్టంగా ఉన్నా డ్రైన్స్‌ను కూలగొట్టి కొత్తవి కడుతూ నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. అలాకాకుండా అవసరం ఉన్నచోట రోడ్ల నిర్మాణాలు చేస్తే అందరికి ఉపయోగకరంగా ఉంటుంది.

– కుదరవల్లి బసవయ్య, కోదాడ

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



గులాబీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కోరారు. మంగళవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మునగాల మండలం తాడువాయి గ్రామానికి చెందిన పలువురు ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుండటంతో ప్రజలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని, పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపునిస్తామని తెలిపారు. పార్టీ కార్యకర్తలు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో తొగరు రమేష్, కోలా ఉపేందర్‌రావు, సంజీవ, లాక్యానాయక్, సైదులు, ఉపేందర్, ఆంజనేయులు, యాదగిరి, యల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ మహిళా మోర్చా నాయకులు

కోదాడ : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని, మహిళలు ప్రధాని మోదీకి రుణపడి ఉంటారని బీజేపీ మహిళా మోర్చా నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని రంగా థియేటర్ సెంటర్‌లో మహిళా మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయంతో జనాభాలో 50 శాతం ఉన్న మహిళలకు ప్రభుత్వాలు చేసే చట్టాలలో పూర్తి భాగస్వామ్యం దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో కోటకొమ్ముల భాగ్యలక్ష్మి, నూకల పద్మావతిరెడ్డి, అక్కిరాజు యశ్వంత్, బొలిశెట్టి కృష్ణయ్య, సాతులూరి హనుమంతురావు, ఓరుగంటి పురుషోత్తం, వంగాల పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులు అమానుషం



కోదాడరూరల్ : కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్ : న్యాయవాదులపై భౌతిక దాడులకు పాల్పడడం అమానుషమని హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. సోమవారం సూర్యాపేటలో న్యాయవాది మంద్ర మల్లయ్యయాదవ్ సతీమణి నాగమణిలపై కొందరు వ్యక్తులు భౌతిక దాడికి పాల్పడడాన్ని నిరసిస్తూ న్యాయవాదులు మంగళవారం తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితులపై పోలీసులు వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం బార్ అసోసియేషన్ తీర్మాన కాపీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్, సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు కాల్వ శ్రీనివాసరావు, వి.అంజయ్య, రాఘవరావు, ఎం.అంజయ్య, కె.సురేష్, వి.యాదగిరి, లతీఫ్, జి.నవీన్, ఎం.గోపీనాథ్, పి.వీరు, శంకర్, వెంకటేష్, ఎం.నాగేశ్వరరావు, రమణారెడ్డి, నారాయణరెడ్డి, రామ లక్ష్మారెడ్డి, కోటిరెడ్డి, అడవి రాముడు, ఆదాం, హరికృష్ణ పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి నిరసన

కోదాడరూరల్ : న్యాయవాదులపై దాడులకు పాల్పడుతున్న దుండగులను కఠినంగా శిక్షించాలని కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సూర్యాపేటలో న్యాయవాది మల్లయ్య అతని కుటుంబ సభ్యులపై దాడి చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం కోదాడలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసనాయుడు మాట్లాడుతు న్యాయవాదిపై దాడి చేసిన వారిపై చట్టరిత్యా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాధుశరత్‌బాబు, కోశాధికారి పాషా, శ్రీధర్, మోషి, కృష్ణయ్య, నరసయ్య, వెంకట్‌రెడ్డి, రంగారావు, నరసింహారావు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

బాలుర పాఠశాల హెచ్‌ఎంగా సలీం షరీఫ్



బాధ్యతలు స్వీకరిస్తున్న హెచ్ఎం సలీంషరీఫ్

కోదాడ : ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా కోదాడ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఎండీ. సలీం షరీఫ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నడిగూడెం మండలం రత్నవరం పాఠశాల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం కోదాడతో పాటు అనంతగిరి, మునగాల, నడిగూడెం, చిలుకూరు మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓగా వ్యవహరిస్తున్నారు. ఈయనతో పాటు కె.విమలకుమారి గుడిబండకు, సీహెచ్.లింగారెడ్డి దోరకుంటకు, పి.గోవిందయ్య కొమరబండకు, ఎం.ఇందిర బాలాజీనగర్‌కు, తల్లాడ శ్రీనివాసరావు గోండ్రియాలకు, జి.నర్సింహారెడ్డి పాలెఅన్నారంకు, వి.వసంత నల్లబండగూడెంకు, జి.రాజు తమ్మరబండపాలెంకు, ఎస్.హరికిషన్ తొగర్రాయికి, వి.శరత్‌బాబు చిమిర్యాలకు, జి.శివకుమారి కట్టకొమ్ముగూడెంకు, వి.రామారావు కాపుగల్లుకు, డి.వెంకటేశ్వరరావు గణపవరానికి, ఎం. వెంకటయ్య పాలవరానికి, పి.సుజాత అమీనాబాద్‌కు హెచ్‌ఎంలుగా నియమితులయ్యారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్ష



మునగాల : రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మునగాల : పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపూరి రాజు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామని హామీ నేటికీ నెరవేర్చలేదన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకపోతే తెలంగాణలో బీజేపీని భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు లంజేపల్లి శ్రీను మాదిగ, ఎంఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు కొత్తపల్లి అంజయ్య, ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ మండల, పట్టణ అధ్యక్షుడు కుడుముల రాంబాబు, నాయకులు బాలునాయక్, రవి, సైదులు అమరబోయిన శ్రీను పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి

కోదాడరూరల్ : బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపూరి రాజుమాదిగ అన్నారు. ఎస్సీవర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోదాడలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న దీక్ష మంగళవారం 11వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సత్యరాజుమాదిగ, బీసీ నాయకులు బ్రహ్మచారి, శ్రీకాంత్, వెంకన్న, బ్రహ్మం తదితరులు ఉన్నారు.

మఠంపల్లి : పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి అమలు పరచాలని డిమాండ్ చేస్తూ మఠంపల్లిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం 11వ రోజు కొనసాగింది. దీక్షకు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్‌రన్‌మియా సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు దేవభిక్షం, మండల అధ్యక్షుడు దేవపంగు బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బచ్చలకూరి ప్రసాద్, వెంకటేశ్వర్లు, డి ప్రసాద్, పి.బాబు, మాజీ ఎంపీటీసీ కొండలు, పెద సైదులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేయాలని కోరుతూ చింతలపాలెంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేస్తు రిలే నిరాహార దీక్ష మంగళవారం కొనసాగింది. వీరికి పలువురు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.రమేష్, సీహెచ్.బాలచంద్రుడు, సీహెచ్.నాగేశ్వరరావు, పి.శ్రీను, కె.కొండలు, సాయిబాబా, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డలో ‘మనస్ఫూర్తిగా’ సినిమా చిత్రీకరణ



వెబ్ సినిమా చిత్రీకరణను ప్రారంభిస్తున్న సర్పంచ్, డీసీఎంఎస్ డైరెక్టర్

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో మనస్ఫూర్తిగా వెబ్ సినిమా మూడో షెడ్యూల్ చిత్రీకరణను సర్పంచ్ షేక్ సలీమా రంజాన్, డీసీఎంఎస్ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు మంగళవారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. శ్రీశ్రీనివాస ఆర్ట్స్ క్రియేషన్ బ్యానర్‌పై తిరుప్ వెల్పుల దర్శకత్వంలో హీరో విజేతసాయి, హీరోయిన్ ప్రియా నటిస్తున్న ఈ సినిమాకి సంబంధించిన పలు సన్నివేశాలను ఆలయ ఆవరణలో చిత్రీకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ లక్ష్మణరావు, అసోసియేట్ డైరెక్టర్ కన్నెబోయిన సత్యనారాయణ, ఆర్టిస్టులు అంకతి రవికుమార్, నాగేశ్వరరావు, ఉపేందర్, వెంకటేశ్వర్లు, రామస్వామి, స్వాతి, లక్ష్మి, గోపాలం, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

వాడవాడలా కొలువుదీరిన గణనాథులు



కోదాడరూరల్ : పూజలు నిర్వహిస్తున్న అశోక్‌గౌడ్- కవిత దంపతులు, ఉద్యోగులు



కోదాడ : విజయగణపతి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

కోదాడ : పట్టణంలోని ముఖ్య కూడళ్లలో దాదాపు 80 వరకు మండపాలను ఏర్పాటు చేసి సోమవారం వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. విజయగణపతి దేవాలయంలో సోమవారం ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. నయానగర్‌లో వినాయక మండపం వద్ద కాంగ్రెస్ నాయకుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి పూజలు చేశారు. ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బీఆర్‌ఎస్ నాయకుడు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా మండపాల వద్ద భక్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

కోదాడ : గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోదాడ మార్కెట్ మాజీ చైర్మన్ బుర్రా సుధారాణిపుల్లారెడ్డి కోరారు. మంగళవారం కోదాడలోని సనా కళాశాల వద్ద సన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆమె కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుర్రా ప్రమోద్‌రెడ్డి, నర్సింహారెడ్డి, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు సోమ, మంగళవారాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని విఘ్నేశ్వర మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. పలు వినాయకుడి మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

చిలుకూరు : మండలంలోని గ్రామాల్లో సోమవారం వినాయకుడి విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా 112 గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేశారు.

నడిగూడెం : మండల వ్యాప్తంగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నడిగూడెంలో మంగళవారం స్థానిక ఎస్‌ఐ ఏడుకొండలు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోదాడరూరల్ : మండల పరిధిలోని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల సభ్యులు విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. మైహోం ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో గణనాథుని విగ్రహం వద్ద సంస్థ మేనేజర్ చెరకు అశోక్- కవిత దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మోతె : మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు వినాయకులను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు.

మఠంపల్లి : మండలంలో సోమవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మట్టపల్లి శివాలయంలో ప్రతిష్ఠించిన గణేష్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

నేరేడుచర్ల : మండలంలో వాడవాడలా వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు.

గరిడేపల్లి : మండలంలోని గ్రామాల్లో సోమవారం వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పూజలు చేస్తున్నారు.

మేళ్లచెరువు : మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకుని విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. వాడవాడలా గణనాథులను ప్రతిష్ఠించడంతో పండగ వాతావరణం నెలకొంది.



నేరేడుచర్ల : ఎస్‌ఆర్‌కె అపార్ట్‌మెంట్‌లో..



హుజూర్‌నగర్ : పూజలు చేస్తున్న భక్తులు



నడిగూడెం: పూజలు చేస్తున్న ఎస్‌ఐ ఏడుకొండలు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



చిలుకూరు : స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

చిలుకూరు : ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీడీఓ ఈదయ్య అన్నారు. బుధవారం చిలుకూరులో స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలల్లో భాగంగా స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇంటి ముందుకు వచ్చే చెత్త ట్రాక్టర్‌లో వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొడారు బాబు, కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, బిల్ కలెక్టర్ ధర్మయ్యగౌడ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు

మఠంపల్లి : మండలంలోని గ్రామాల్లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు, ఎంఈఓ చత్రునాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వలంటీర్లు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కాలనీవాసులు

నడిగూడెం : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు మంజూరు చేయాలని రత్నవరం గ్రామానికి చెందిన పలువురు ఎస్సీ కాలనీవాసులు కోరారు. మంగళవారం రత్నవరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలో అధికార బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అర్హత కలిగిన పేదలకు గృహలక్ష్మి, దళితబంధు వంటి పథకాలు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. సమావేశంలో ఉప సర్పంచ్ మొలుగూరి ఉపేందర్, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మొలుగూరి నర్సింహారావు, అమర బోయిన రమేష్, ఉపేందర్, నాగరాజు, సుశీల, నాగమణి, గుర్వమ్మ, సీతమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న రాములు

మునగాల : ములుగు జిల్లా వాజేడులో ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించబోయే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల శాఖ అధ్యక్షుడు ఆరె.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు సమగ్ర శాసన చట్టం కోసం పేదలందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పాలకవర్గాలు సంక్షేమ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చి సంక్షేమ రంగాన్ని సమాధి చేస్తున్నాయని విమర్శించారు. వాజేడులో జరిగే సమావేశంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగ నిపుణులతో సదస్సులు, సెమినార్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సొంపంగు జానయ్య, మండల కమిటీ సభ్యులు కిన్నెర వెంకన్న, గుండు కరుణాకర్, లంజేపల్లి వెంకయ్య, బచ్చలకూర సుధాకర్, ఆర్.లింగయ్య పాల్గొన్నారు.

బడుగుల శ్రేయస్సే బీఎస్పీ లక్ష్యం

హుజూర్‌నగర్‌రూరల్ : బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సే బహుజన సమాజ్‌వాది పార్టీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దేశగాని సాంబశివగౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బూరుగడ్డలో ఆ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మంద రవి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన బత్తిని సైదులగౌడ్‌తో పాటు పలువురికి కండువాలు కప్పి బీఎస్పీలోకి ఆహ్వానించారు. తదనంతరం సైదులుగౌడ్‌ను బీఎస్పీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా నియమించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ సోషల్ మీడియా కన్వీనర్ యరగాని వినయ్‌గౌడ్, వెంపటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



సన్మానం పొందిన వారితో సర్పంచ్, గ్రామస్తులు

గరిడేపల్లి : గ్రామ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ జోగు సరోజని పిచ్చిరెడ్డి కోరారు. మండలంలోని పొనుగోడు గ్రామంలో ఇటీవల ఎస్‌ఐ ఉద్యోగం, ఎంబీబీఎస్ సీటు సాధించిన నందిపాటి భాను ప్రకాష్, బత్తిని ప్రసన్న, మల్లికంటి మౌనికలతో పాటు రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకున్న స్థానిక సర్పంచ్ జోగు సరోజనిపిచ్చిరెడ్డి, గ్రామ కార్యదర్శి సైదులును మంగళవారం స్థానిక ప్రజలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జోగు అరవింద్‌రెడ్డి, పకీరా, వెంకన్న, రఫీ, నరేష్, సైదులు, రాంబాబు, జానీ, శ్రీను, పిచ్చయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

భిక్షారెడ్డికి నివాళి

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాలలో మంగళవారం సీపీఎం సీనియర్ నాయకుడు రణబోతు భిక్షారెడ్డి రెండవ వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి కేసగాని భద్రయ్య, నాయకులు సతీష్‌రెడ్డి, సర్దార్, మహిమూద్, పద్మ, రాధిక, జస్మిక పాల్గొన్నారు.